

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గ్‌లో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (9)*

## *( షాపులు పిలుస్తున్నాయి* ***బెర్లిన్‌లో నేను, నా కుటుంబం****)*

**షాపింగంటే** చాలామందికి ముఖ్యంగా ఆడవాళ్లకి చాలా ఇష్టంగా ఉంటుంది. శ్రీమతి అందుకు భిన్నం కావడం నాకు ఆశ్చర్యమైతే – అది నా అదృష్టమనేవారు నా మిత్రులు. అలాంటి శ్రీమతి కూడా – 'రాయల కాలంలో రాచబాట పక్కన రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు' అని ఎవరో అనగా విన్నప్పుడు, 'షాపింగ్ చేస్తే – అలాంటిచోట చెయ్యాలి' అని నన్ను ఆశ్చర్యపరిచింది.

అప్పుడు నాకర్థమైంది. షాపింగంటే ఆసక్తి ఉన్నవాళ్లు వెతుక్కుంటూ షాపులకి వెడతారు. షాపులు ఆకర్షించే షేపులకి ప్రాధాన్యమిస్తే – ఆసక్తి లేనివారికి కూడా వాటి పిలుపు వినిపిస్తుంది. కర్టెసీకైనా ఆ పిలుపుని మన్నించాలనిపిస్తుంది. ఒకసారి షాపుల్లో అడుగెట్టామా – ఆ తర్వాత మన అసలు వ్యక్తిత్వానికి పరీక్ష మొదలౌతుంది.

అప్పటికి మన దేశంలో షాపుల్లో ఇప్పటి ప్రభలు లేవు. అందులోనూ భువనేశ్వర్లో మరీనూ. పోలికలో అక్కడి షాపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిన్న పట్నాల వాటికి కూడా దరిదాపుల్లో ఉండేవి కాదు.

జర్మనీలో అడుగెడుతూనే నేను ప్రత్యేకంగా ఫీలైనది – షాపుల విషయంలో. పట్నాలలోనే కాదు – పల్లెల్లో కూడా – 'షాపింగుకోసమే జీవితం' అని జనం అనుకునేంత ఆకర్షణీయంగా ఉండేవి షాపులు. నాకు రాయల కాలం గుర్తుకొచ్చింది.

అప్పుడే నాకు అనిపించింది, 'భార్యాబిడ్డలతో ఇక్కడ షాపుల్లో తిరగని జీవితమూ ఓ జీవితమేనా?' అని.

ఇప్పుడు నావాళ్లిక్కడే ఉన్నారు. జీవితాన్ని జీవితం అనిపించుకోగల అవకాశం నాకొచ్చింది.

ప్రతి రోజూ ఏదో ఓ సమయంలో బయటికెళ్లి కనీసం రెండు మూడు షాపుల దర్శనం చేసుకొచ్చేవాళ్లం.

శ్రీమతి పూర్వకాలపు మనిషేం కాదు. ఆలోచనల్లో ఐతే తన కాలానికి ఓ దశాబ్దం ముందే ఉంటుంది. కానీ దుస్తుల విషయంలో మాత్రం తను అలవాటుపడ్డ సంప్రదాయాన్ని విడవను కాక విడవలేకపోయేది.

తను జర్మనీలో అడుగెట్టగానే చెప్పాను – ఇక్కడి వాతావరణానికి చీరలు సరిపడవనీ, పాంట్లలోకి మారక తప్పదనీ.

దానికి బదులుగా, ''భువనేశ్వర్లో నా వయసువాళ్లు చుడీదార్ వేసుకుంటే, నడకకి చీరకంటే అదే ఎక్కువ వీలని తెలిసినా – మారలేకపోయాను. ఎందుకో నాకు చీర కాక మరే దుస్తులు వేసుకున్నా – మతం మార్చుకున్నంత ఇబ్బంది కలుగుతుంది'' అంది శ్రీమతి.

''కానీ ఇది చలి దేశం. ఇక్కడ మారక తప్పదు'' అన్నాను.

''ఇక్కడికి రాగానే మీకూ మీ సహచరులు చెప్పారు – ఇది చలిదేశం, ఇక్కడ విస్కీ, బ్రాందీలు అలవాటు చేసుకోవాలని. విన్నారా?'' అంది శ్రీమతి.

''వినలేదంటే – అందులో నిజానిజాలు స్వయంగా తేల్చుకోవాలనుకున్నాను తప్ప – వాళ్ల మాట కొట్టిపారెయ్యాలనుకోలేదు''

''కదా – నేనూ అంతే అనుకొండి'' అంది శ్రీమతి.

అప్పుడు నాకు చిన్నప్పుడు చందమామలో చదివిన తండ్రీకొడుకుల కథ గుర్తుకొచ్చింది.

కొడుకు ఇంటి బయట ఎండలో చెమటలు కక్కుతూ పని చేస్తుంటే – తండ్రి వచ్చి, ''ఎండగా ఉందిరా నాయనా! కాసేపు లోపలికొచ్చి నీడపట్టున విశ్రాంతి తీసుకో'' అన్నాడు. కొడుకు ఆయన మాటలు లెక్క చెయ్యకుండా పని చేస్తూనే ఉన్నాడు.

చివరకు విసుగొచ్చిన తండ్రి – నెలల వయసున్న మనవణ్ణి తీసుకొచ్చి ఎండలో పడుకోబెట్టాడు. అది చూసిన కొడుకు, "పెద్దవాడివి, మతి కానీ పోయిందాయేం? చంటిపిల్లాణ్ణి ఎండలో పడుకోబెడతావా?" అని తన పని మానుకుని చంటిపిల్లాణ్ణి ఎత్తుకుని ఇంట్లోకి తీసుకువెళ్లాడు.

తండ్రి నవ్వి, "నీ కొడుకు ఎండలో ఉంటే నీ ప్రాణం గిలగిల్లాడిపోయిందా – మరి నా కొడుకు ఎండలో ఉంటే, నాకూ అంతే కదా! మతి నీకు పోయిందా, నాకు పోయిందా, చెప్పు" అన్నాడు.

పాపం – నా మిత్రులు – నామీద అభిమానంతో కనీసం వైనయినా పుచ్చుకోమని నాకో సలహా ఇస్తే, అది నేను లెక్క చెయ్యలేదు. ఆ సలహా నాకు అవసరం లేదని ఋజువు చెయ్యాలనుకున్నాను, చేశాను.

ఇప్పుడు శ్రీమతి నా సలహా విషయంలో అదే చేసింది.

కానీ తను ఇండియాలోలా చీర కట్టుకుని బయటికొస్తే చలికి గడ్డ కట్టుకుపోతుందని నా భయం.

ఐతే శ్రీమతి లాజిక్ వేరు.

జర్మనీలో చాలామంది ఆడవాళ్లు – చాలా భాగం వళ్లు కనిపించేలాగే వస్త్రధారణ చేస్తారు. చలికాలంలో కూడా వారి వస్త్రధారణలో పెద్ద మార్పేం ఉండదు. వాళ్లే చలికి తట్టుకున్నప్పుడు వళ్లంతా కప్పే చీర చలిని ఆపదా?

ఆమె అన్న ఈ మాటలోనే చలికి సమాధానం కూడా ఉంది. జర్మన్ మహిళలు ఎంత పొట్టి దుస్తులు వేసుకున్నా – ముందు స్ట్రుంప్‌హోజెన్ (లెగిన్స్) ధరిస్తారు. అవి అతిపల్చగా ఉంటాయి. వేసుకుంటే వంటికి పట్టి చర్మం రంగులో కలిసిపోతాయి. చెబితే తప్ప అవి ధరించిన విషయం తెలియదు. అవి ఎంత చలినైనా ఆపుతాయి. వాటి ధర్మమా అని శ్రీమతి చీరకట్టుకి చలి అడ్డంకి కాలేదు.

మా పిల్లలు తెల్లగా మిసమిసలాడుతున్నా – చూడగానే అక్కడివారు కారని తెలిసిపోతుంది. శ్రీమతి చీరకట్టు. మేము నలుగురం ఏ షాపుకెళ్లినా కొంచెం ప్రత్యేకంగానే కనిపించేవాళ్లం. ఐతే అక్కడివారి సత్సంప్రదాయం – అపరిచితుల్ని కూడా స్నేహపూర్వకమైన చిరునవ్వుతో పలకరించడం. చిన్నపిల్లల్ని చూసి ముచ్చట పడడం.

మేమే షాపుకెళ్లినా ఆ పలకరింపు మాలో బెరుకు పోగొట్టి కొత్త ఉత్సాహాన్నిచ్చేది.

అక్కడ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో – బిల్కా, హర్టీ, వెర్ట్‌హైమ్, వూల్‌వర్త్, కార్‌స్టాడ్ట్, నెక్కర్‌మన్, క్వెల్లే – ఇవి కొన్ని పేర్లు. ఇంచుమించు అన్ని నగరాల్లోనూ వీటికి బ్రాంచిలుంటాయి.

పిల్లలు రాగానే నేనో రోజు బిల్కా షాపుకి వెళ్లే ప్రోగ్రాం వేశాను. ఆ షాపు రైల్వేస్టేషనుకి దగ్గర్లో ఉంది. వీళ్లు రాకముందు నేనందులోకి చాలాసార్లు వెళ్లాను. అందులో నన్ను బాగా ఆకర్షించింది ఓ కుక్కపిల్ల బొమ్మ. చూడ్డానికి అచ్చం నిజం కుక్కపిల్లలాగే ఉంది. దాని మెడకి చిన్న బెల్టు. ఆ బెల్టుకి తాడులాంటి ఓ గొలుసు. తాడు చివర బ్యాటరీ హోల్డరుంది. దానికి రెండు మీటలు. ఒకటి నొక్కితే కుక్కపిల్ల నోరు తెరచి భౌ భౌ మని మొరుగుతుంది. రెండో మీట నొక్కితే కుక్కపిల్ల తోక ఊపుకుంటూ నెమ్మదిగా ముందుకు నడుస్తుంది. బొమ్మ ఖరీదు 15 మార్కులు.

వచ్చినప్పట్నించి ఆ బొమ్మని ఇప్పటికి ఐదారుసార్లు చూసుంటాను. మా పిల్లలకి చూపించి, వాళ్ల ముఖాల్లో వెలుగులు చూసి ఆనందించాలని కలలు కనేవాణ్ణి.

ఆ కల తీర్చుకుందుకే ఈరోజు వాళ్లనక్కడికి తీసుకెళ్లాను.

మా ఇంటినుంచి నాలుగు నిముషాలు నడిస్తే డాయిచే ఓపర్ అనే ఊ బాన్‌హాఫ్ (మెట్రో స్టేషన్) ఉంది. అదెక్కితే మొదటి స్టాపు నా ఆఫీసుకి దగ్గర్లోని ఎర్నెస్ట్ రాయిటర్ ప్లాట్జ్. రెండోది జూ (జంతు ప్రదర్శనశాల). అక్కడే బెర్లిన్ రైల్వే స్టేషనుంది. అక్కడే బిల్కా షాపు కూడా ఉంది.

నేననుకున్నట్లే పిల్లలిద్దరికీ కుక్కపిల్ల బొమ్మ చాలా నచ్చింది. ఐతే వెంటనే కొనలేదు నేను. నెల్లాళ్లపాటు అల్లరి చెయ్యకుండా బుద్ధిగా ఉంటే కొంటానన్నాను.

ఇలాంటి విషయాల్లో మా వాళ్లు చాలా బుద్ధిమంతులు. వెంటనే బుద్ధిగా తలలూపారు.

అక్కణ్ణించి దగ్గర్లోనే ఉన్న హర్టీ షాపుకి వెళ్లాం. అది బిల్కాకంటే కూడా చాలా పెద్దది.

బయట చేతులకి, చెవులకి చలి. లోపలికెళ్లగానే వెచ్చదనం. పిల్లలకి ఈ అనుభవం కొత్తగానూ, సరదాగానూ ఉంది.

అమాయకమైన కళ్లతో పరిసరాల్ని ఆసక్తిగా చూస్తూ వాళ్లు మాతోపాటే నడుస్తున్నారు.

అప్పటికి మాకింకా కుక్కపిల్ల హాంగోవర్ పోలేదు. ఆ బొమ్మ అచ్చం నిజం కుక్కపిల్లలాగే ఉండడం, దాన్ని చూసి పిల్లలు తెగ మురిసిపోవడం, వెంటనే కొనేసి ఉండాల్సిందేమోనన్న ఫీలింగ్సు – ఇలా మాట్లాడుకుంటూ నేను బాబుతో, ''ఇందాకా, కుక్కపిల్ల ఏం చేసిందిరా?'' అన్నాను ముచ్చటగా.

అంతే!

నిండా మూడేళ్లు లేని బాబు నా చెయ్యి విడిపించుకున్నాడు. నేలపై రెండు చేతులూ, కాళ్లూ ఆన్చాడు. తనూ కుక్కపిల్లలాగే రెండు సార్లు తలూపాడు. తర్వాత ముందుకు నెమ్మదిగా నడిచి ఓ క్షణమాగి భౌ భౌ అన్నాడు.

ఆ క్షణంలో వాణ్ణి చూస్తే – మేము చూసిన బొమ్మే కొంచెం పెద్ద సైజులో ఉందనిపించింది.

వాడలా చేస్తాడని నేనూహించలేదు. చుట్టుపక్కల ఎవరైనా చూస్తారేమోనని కంగారుపడి అటూ ఇటూ చూస్తే అప్పటికే జనం మమ్మల్ని చుట్టుముట్టారు.

నాకూ, శ్రీమతికీ చచ్చేటంత సిగ్గయింది. కానీ అది ఒక్క క్షణమే!

చుట్టూ ఉన్నవాళ్లు మావాళ్లని తెగ ముచ్చటగా చూస్తున్నారు.

ఒక జర్మన్ వనిత వాణ్ణి ఎత్తుకుని, ''వెరీ స్వీట్'' అంది. ఆమె వాణ్ణి దింపీ దింపగానే ఇద్దరి పిల్లల జేబులూ చాక్లెట్లతో నిండిపోయాయి.

షాపులు రాజభవనాల్లో హాల్సులా చాలా పెద్దవి, అమ్మే సరుకులు ప్రతీదీ కళ్లకి కనబడేలా అమర్చి ఉంటాయి. ధరలు వాటిమీదే వ్రాసుంటాయి. అయినప్పటికీ మహాతీర్థంలా కనిపించే ఆ షాపుల్లో ఏ సరుకు ఎక్కడుందో తెలుసుకోవడం అంత సులభం కాదు. కస్టమర్సుకి ఆ విషయమై సాయపడ్డం కోసం ప్రత్యేకంగా కొందరు సేల్స్ బాయ్స్, సేల్స్ గర్ల్స్ ఉంటారు. ఎవరైనా దేనికోసమైనా వెతుకుతున్నట్లు కనబడితే వాళ్లు క్షణాలమీద వచ్చి, ''బిట్టే షోన్'' (యెస్ ప్లీజ్ లాంటిది) అంటారు.

బిట్టే షోన్ అన్నది అక్కడ పలకరింపు.

థాంక్స్ చెప్పినవారికి బిట్టే షోన్ అని బదులివ్వడం నోమెన్షన్ లాంటిది. షాపుల్లో అది మే ఐ హెల్ప్‌యూ అన్న అర్థాన్ని ధ్వనిస్తుంది.

సాధారణంగా మేము షాపులకి వెళ్లేది ఆసక్తికరమైనవి ఏమున్నాయో చూడ్డానికే. ఆ చూడ్డం ఒకోసారి కేవలం కాలక్షేపానికి. ఒకోసారి సర్వేకి.

సర్వే అక్కడ చాలా అవసరం. ధరలు షాపు షాపుకీ మారిపోతుంటాయి. ఒక షాపులో 190 మార్కులున్న టేపు రికార్డరు మరో షాపులో 368 మార్కులు. మిగతా షాపుల్లో ధరలు వీటి మధ్యలో ఉంటాయి.

ఒక షాపులో ఒక ఐటం చవగ్గా ఉంది కదా అని అక్కడ మిగతావన్నీ కూడా చవగ్గా ఉంటాయనుకుందుకు లేదు. ఒకో షాపులో ఒకో ఐటం చవగ్గా ఉంటుంది. అందువల్ల అన్ని వస్తువులూ ఒకే షాపులో కొనేవారికి పెద్దగా నష్టముండదు.

యూరోపియన్ కస్టమర్సుకి మార్కెట్ సర్వేపై ఆసక్తి కానీ, అందుకు సమయం కానీ ఉన్నట్లు అనిపించదు. మేము మాత్రం అన్ని షాపులూ తిరిగి ఎక్కడ ఏది చవగ్గా ఉంటుందో అదే కొనేవాళ్లం. అందువల్ల డబ్బు ఆదా ఒక ప్రయోజనమైతే – క్రమంగా షాపుల తీరు గురించి పూర్తి అవగాహన వస్తుంది.

అలాంటి మేము షాపింగుకి వెడితే – ఇలా అడుగెట్టామో లేదో, అలా ఎవరో ఒకరు 'బిట్టే షోన్' అంటూ వచ్చేసేవారు.

ధరలు సర్వే చేస్తున్నామని చెప్పలేం. ఏమున్నాయో చూస్తున్నామని చెప్పలేం. కానీ వాళ్లని వదుల్చుకోవాలి. అందుకు కొంచెం మొహమాటం. కొంచెం ఇబ్బంది.

అలాగని ఏదో ఒకటి కొనెయ్యలేం కదా – వాళ్లతో డీల్ చెయ్యడానికి క్రమంగా అలవాటు పడ్డాం.

సేల్స్ బాయ్స్‌కీ, సేల్స్ గరల్స్‌కీ మేము బిట్టేషోన్లు అని పేరెట్టుకున్నాం.

ఏ షాపులోనైనా అడుగెట్టినప్పుడు చుట్టూ చూసి బిట్టేషోన్లు దగ్గర్లో లేని చోటకు వెళ్లి సర్వే మొదలెట్టేవాళ్లం.

ఒకసారి అలా సర్వేలో ఉండగా ఎక్కణ్ణించో ఓ బిట్టేషోన్ మా దగ్గరికొచ్చేసింది.

ఏం చెప్పాలా అని ఆలోచిస్తుండగా ఆమె మాతో మాట్లాడకుండా పిల్లలిద్దర్నీ ఒకరి తర్వాత ఒకర్ని ఎత్తుకుని ముద్దులాడింది. ఇద్దరికీ చెరో గుప్పెడు చాక్లెట్లు ఇచ్చింది.

పిల్లలకి నేను 'డాంకె షోన్' (థాంక్యూ వెరీమచ్) అనడం నేర్పాను. ఇద్దరూ నా అనుమతితో చాక్లెట్లు తీసుకుని ఆమెకి డాంకేషోన్ చెప్పారు.

ఆమె మరింత ముచ్చటపడి – ఈసారి వాళ్లిద్దరి జేబులూ చాక్లెట్లతో నింపి వాళ్లతో కబుర్లు మొదలెట్టింది.

''వాళ్లకు జర్మన్ అర్థం కాదు'' అని నేనామెకి చెప్పాను.

''పోనీ ఇంగ్లీషొచ్చా?'' అనడిగిందామె.

మాట్లాడ్డానికి ఇష్టపడరు కానీ చాలామంది జర్మన్సుకి ఇంగ్లీషు బాగా వచ్చు. మా పిల్లలకి ఇంగ్లీషు కూడా రాదని నేను చెప్పగానే, ''ఇంత ముద్దొచ్చే పిల్లలతో సంభాషించలేకపోవడం ఎంత దురదృష్టం?'' అని భారంగా నిట్టూర్చిందామె.

పిల్లలంటే – కుల మత జాతి భాషా భేదం లేకుండా అలరించే ఓ అద్భుతం. మన పెంపకంతో వాళ్లకి కుల మత జాతి భాషా భేదాల్ని పులుముతున్నామని నాకు అనిపించింది.

ఆ తర్వాత ఆమె మాకు ఆ షాపులో చాలాసార్లు కనబడింది. చూడగానే వీళ్లిద్దర్నీ దగ్గరకు తీసుకుని కాసేపు ముద్దులాడేకనే మిగతా పనులు చూసేది. అందువల్ల మాకులాగే చూడ్డానికి మాత్రమే షాపుకొచ్చినవాళ్లకి బిట్టేషోన్ అంతరాయం కాసేపు తప్పేది.

చిన్నా పెద్దా తేడా లేకుండా అక్కడ ఇంచుమించు ప్రతి షాపులోనూ కదిలే మెట్లు (ఎస్కలేటర్లు) ఉన్నాయి.

మా పిల్లలకి ఆ మెట్లు చాలా నచ్చాయి. షాపులో పై అంతస్తుకి వెళ్లాలంటే వాటిమీదే వెళ్లాలనేవారు. పరుగునవెళ్లి వాటిమీద నిలబడేవారు.

నిజం చెప్పాలంటే ఆగకుండా కదిలే ఆ మెట్లమీద ఎక్కి స్థిరంగా నిలబడ్డం పెద్దవాళ్లమైన మాకే అంత సులభం కాదు. ఆ తర్వాత పై అంతస్తుకి చేరేక జాగ్రత్తగా అడుగు తీసి నేలమీద పెట్టేటప్పుడు కూడా తడబడి పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి.

మొదటిసారి ఎక్కేముందు నేను ముందు పాపనీ, తర్వాత బాబునీ పైకి తీసుకెళ్లి అక్కడ నిలబెట్టాను. శ్రీమతికి పక్కనుండి జాగ్రత్తలు చెబుతూ పైకి ఎక్కించాను.

పిల్లలూరుకుంటారా – తనకి తనే మెట్లెక్కుతానని రెండోసారికే పాప పట్టుబట్టింది. ఏమైతే అయిందని సరేనంటే అవలీలగా పైకి చేరిపోయిందది.

అప్పుడు దాని మొహం చూడాలి. తొలిసారి ఎవరెస్టుమీద అడుగెట్టిన టెన్సింగ్ నార్వే ముఖంలో కూడా అప్పుడంత గర్వం కనబడి ఉండదు.

బాబుకి ప్రతి విషయంలోనూ అక్కతో పోటీ. ''నేను, నేను'' అంటూ గొణుగుడు మొదలెట్టాడు.

కొంచెం సంకోచించాను కానీ — ఆ మెట్లమీద ప్రమాదాలేం జరుగవని నమ్మకముంది కాబట్టి – సరేనన్నాను.

ఆశ్చర్యంగా వాడు కూడా అవలీలగా పైకి వెళ్ళిపోయాడు. వాడి మొహం కూడా అక్క మొహంలాగే ఉంది.

శ్రీమతి మాత్రం తను మెట్లెక్కుతున్నప్పుడు నన్ను తన పక్కనుండమంది.

''పిల్లల్ని చూసి ధైర్యం తెచ్చుకో'' అన్నాను.

కానీ ఆమె భయం వేరు. కదులుతున్న ఆ మెట్ల మధ్యలో తన చీర ఇరుక్కుంటుందని ఆమె భయం.

తల్లి భయపడుతుంటే పిల్లలకి చాలా గొప్పగా ఉండేది. భయం లేదని ఆమెకి ధైర్యం చెప్పి ఎలా ఎక్కాలో డిమాన్‌స్ట్రేట్ చేసి చూపిస్తుండేవారు. తను ఇంకా భయపడితే వేళాకోళం చేసేవారు. శ్రీమతి ముచ్చట పడి మరికాస్త భయం నటించేది.

పిల్లల్ని చూసి నేనూ కాస్త ధైర్యం తెచ్చుకుని – శ్రీమతి భయాన్ని వేళాకోళం చేశాను. అంతే – వెంటనే అలిగేసింది.

ఆ అలక నటన కాదు. నిజమని గ్రహించేక – నా పాట్లు మొదలయ్యాయి.

ఇల్లు కట్టడానికి ఏడాది పడుతుంది. కూల్చడానికి ఒక్కరోజు చాలు. అదే అలకైతే రప్పించడానికి క్షణం చాలు. పోగొట్టడానికి ఒకోసారి రోజులు కూడా చాలవు.

ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా సరే అక్బర్–బీర్బల్ కథ ఒకటి స్ఫురణకి తెచ్చుకోవాలి.

ఒకసారి అక్బర్ – తను ఎవరి కోరికనైనా తీర్చగలనని అన్నాడు. ''ఎవరి కోరికలైనా తీర్చగలరు, చిన్నపిల్లలవి తప్ప'' అన్నాడు బీర్బల్. తన మాట ఋజువు చేసుకుందుకు తనే చిన్నపిల్లాడిలా నటిస్తానన్నాడు. అక్బర్ సరేననగానే బీర్బల్, ''నాకు ఇప్పుడే పితికిన పాలు గ్లాసుడు కావాలి'' అన్నాడు. అక్బర్ ఓ పాడిఆవుని రప్పించి ఓ గ్లాసునిండా పాలు పితికించి బీర్బల్‌కి ఇచ్చాడు. బీర్బల్ అందులో సగం తాగి, మిగతా సగం పాలనీ మళ్ళీ పొదుగులోకి పంపించెయ్యమని ఏడ్చాడు. అక్బర్ తెల్లమొహం వేశాడు.

తల్లిని వేళాకోళం చేసి కూడా సంతోషపెట్టగలగడం చిన్నపిల్లలకి మాత్రమే సాధ్యమైన ఓ కళ.

ఇకమీదట ఆ విషయంలో వాళ్లని అనుకరించకూడదని గట్టిగా అనుకున్నాను.

ఒకసారి నేను కదిలే మెట్లమీద పై అంతస్తు చేరుకున్నాను. చుట్టూ ఉన్న బొమ్మల్ని చూస్తున్న పాప కొంచెం ఆలస్యంగా మెట్లెక్కి మధ్యలో పడిపోయింది. భయమేసిందో ఏమో బ్యారుమని ఏడ్చింది. కంగారు పడ్డం మినహా ఏంచెయ్యాలో నాకు తెలియలేదు.

అంతలో పాప లేచి నిలబడింది. దాని వేళ్లు కానీ మెట్ల సందులో ఇరుక్కోలేదు కదా అని నాకు భయమేసింది.

అది పై అంతస్తు చేరుకోగానే, పైకెత్తి నేలమీద నిలబెట్టాను.

పరీక్షించి చూస్తే కాలి వేళ్లేం నలగలేదు. హమ్మయ్య అనుకున్నాను.

ఇక పాప మళ్లీ అది కదిలే మెట్లు ఎక్కనంటుందని అనుమానించాను. కానీ, తిరిగి క్రింద అంతస్తుకి వెళ్లడానికి ఆ మెట్లే వాడితే మళ్లీ హమ్మయ్య అనుకున్నాను.

మనిషికి మరపు వరం అంటారు. ఆ వరాన్ని పిల్లలు ఉపయోగించుకున్నట్లు మనం ఉపయోగించుకోలేం మరి!

పిల్లలతో వచ్చేవారికోసం షాపుల్లో చాలా సదుపాయాలుండేవి.

షాపుల బయట గుర్రం, ఏనుగు, ఖడ్గమృగం, స్కూటర్, కారు వగైరా బొమ్మలుంటాయి. వాటిమీద ఎక్కి కూర్చుని, దానికి ఉన్న కీహోల్‌లో పది ఫెన్నిగ్స్ వేస్తే ఆ బొమ్మ కాసేపు ఊగుతుంది.

చాలామంది పిల్లల్నక్కడ వదిలేసి షాపింగు చేసుకుని వస్తుంటారు.

మాకు మాత్రం పిల్లల్నక్కడ వదిలి వెళ్ళే ధైర్యముండేది కాదు. ఐతే పిల్లల్ని అలా చాలాచోట్ల బొమ్మలపై కూర్చోబెట్టి ఫొటోలు తీశాం.

కొన్ని షాపుల్లో పిల్లలకోసం కార్టూన్ సినిమాలు వేసేవారు. పిల్లల్నక్కడ వదిలి షాపింగ్ చేసుకోవచ్చు కానీ, కార్టూన్ పిక్చర్స్ మాకూ కొత్తే. మేమూ కాసేపు వాళ్ళతో చూసి వినోదించేవాళ్లం.

మేము పిల్లల్ని సంకోచం లేకుండా ఎక్కువగా వదిలి వెళ్ళేది టివి విభాగంలో.

అది 1975. అప్పటికి మన దేశంలో టెలివిజన్లు కొన్ని మహానగరాలకి మాత్రమే పరిమితం. భువనేశ్వర్లో ఐతే టెలివిజన్ లేనే లేదు. ఆ సదుపాయమున్న మహానగరాల్లో కూడా ఒకటే ఛానెల్ వచ్చేది. అదీ రంగుల్లో కాదు – కేవలం తెలుపు నలుపు.

అలాంటిది జర్మనీలో ఒకే షాపులో ఒక పెద్ద హాల్లో వందలాది టివిలు పక్కపక్కనే ఆన్లో ఉండి – రంగురంగుల కార్యక్రమాలు చూపిస్తుంటే వింతగానూ, కొత్తగానూ, కనుల పండువగానూ అనిపించేది. ఒకో టివిలో ఒకో చానెల్. అవి పగలనక, రాత్రనక ప్రసారాలు చేస్తూనే ఉంటాయి.

పిల్లలు వాటిని విడ్డూరంగా చూస్తుంటే మేము షాపింగు చేసేవాళ్లం.

ప్రతి షాపుకీ కెల్లర్ (అండర్‌గ్రౌండ్) విభాగముంటుంది. పప్పులు, మాంసం, బ్రెడ్, కూరలు, అపరాలు వగైరాలన్నీ అమ్మే విభాగాన్ని లెబెన్స్‌మిట్టెల్ అంటారు. చాలా దుకాణాల్లో లెబెన్స్‌మిట్టెల్ కెల్లర్‌లో ఉండేది. మేము వెళ్ళే వెర్ట్‌హైమ్ షాపులో కెల్లర్‌లో పెద్ద ఆక్వారియముంది. దాంట్లో రకరకాల చేపలు, జలచరాలు కదులుతుండేవి. పిల్లలు వాటిని చూసి ఎంతో ముచ్చట పడేవారు.

ఆ ప్రాంతాలకు వెళ్లినప్పుడు పనున్నా లేకపోయినా వెర్ట్‌హైమ్‌లో కెల్లర్‌కి వెళ్లడం రివాజయింది. కానీ అది కొన్నాళ్లే.

ఎందుకంటే ఆ నిలువెత్తు నీటితొట్టె నిజానికి ఆక్వారియం కాదు.

అందులో ఉత్సాహంగా కదలాడే ఓ చేపని ఉన్నట్లుండి బయటకు తీసి త్రాసులో వేసి బరువు చూస్తారు. అది కస్టమర్‌కి ప్యాక్ చెయ్యబడుతుంది.

ఒకసారి నేనా దృశ్యం చూశాను. వళ్లంతా వణుకుపుట్టి శ్రీమతికి చెప్పి బాధపడ్డాను. పాప వింటోందని గమనించలేదు. దానికి విషయం తెలిసిపోయి ఆ చేపల్ని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ తర్వాతనుంచి పాప ఆక్వారియం చూడ్డానికి పెద్దగా ఇష్టపడలేదు. నాక్కూడా ఆ నీళ్ల తొట్టిలోని చేపలు – ఉరిశిక్ష విధించబడ్డ ఖైదీల్లా కనబడేవి.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments